# గ్రహబలం

**కాం**తమ్మ ఆ రోజు మరీ చీకటి వుండగానే లేచింది. చకచకా పని చేసుకుంది. భర్త మంగపతి ఇంకా నిద్రలేవలేదు.

"మీ నాన్నను లేవమనవే! అవతల ప్రయాణం పెట్టుకొని ఇంకా ఏం నిద్ర?" కూతుర్ని కేకపెట్టి చెప్పింది. మంగపతి ఆదరాబాదరాగా లేచి ముఖం కడుక్కొని కాఫీ తాగి స్నానానికి వెళ్ళాడు.

కాంతమ్మ వంటపనిలో మునిగిపోయింది.

"అమ్మాయ్! ఒసేయ్! నిన్నేనే?"

"అబ్బ! ఏమిటే ఆ కేకలు?" కూతురు తార చిందులు తొక్కింది.

"పేపరు రాలేదా?"

"ఆదివారం పేపరు ఇంత త్వరగా వస్తుందా ఏమిటి?" అనేసి వెళ్ళిపోయింది.

వెళ్ళేముందు కాస్త "గ్రహణం" చూచుకొని వెళ్తే బాగుణ్ణు! ఆ పేపరు సమయానికి రాదు! అయినా ఆదివారం, అమావాస్య. పెళ్ళి సంబంధం చూడటానికి ఇవ్వాళ బయలుదేరడం ఏమిటి? ఆ మనిషికి ఎంత తోస్తే అంతే. అరవవాళ్ళకు అమావాస్య మంచిదట!

"ఏమే! వడ్డించావా?" స్నానం చేసి పూజ ముగించి హడావిడిగా వంటింట్లోకి వచ్చాడు మంగపతి.

"ఇదో వడ్డిస్తున్నా!" ఆలోచనలనుంచి బయటపడింది.

ఆదరాబాదరా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని లేస్తున్న భర్తతో "అయ్యో! అదేమిటండీ, మజ్జిగ పులుసు వేసుకోకుండానే లేచారు" అని నొచ్చుకుంటూ అన్నది కాంతమ్మ.

గోతాం పట్టాతో కుట్టిన సంచిలో రెండు ధోవతులూ, నాలుగు పుగాకు కాడలూ పెట్టి అందించింది.

"ఈ సంబంధమైనా ఖాయం చేసుకురండి" అన్నది.

"అంతా మన చేతుల్లోనే వుందా ఏమిటే?"

"త్వరగా బయలుదేరండి... మళ్ళీ వర్జం జొరబడుతుంది" అన్నది కాంతమ్మ.

మంగపతి వీధి వాకిలి మెట్లు దిగుతుండగానే నెత్తి ముసుగుతో వెంకాయమ్మ ఎదురైంది. ఠక్కున ఆగిపోయాడు.

"ఎక్కడ చచ్చావే?" అంటూ పెళ్ళాన్ని వెర్రికేక పెట్టి పిల్చాడు మంగపతి.

"అయ్యో ఏమిటండీ? ఏం జరిగిందీ? శుభమా అంటూ వెళ్తూ ఆ మాటలేవిటి?" సాగదీస్తూ కాంతమ్మ బయటికి వచ్చింది.

"ఇంకేం జరగాలి! ఇంట్లో ఏం పారిపోతుందని లోపలకు పరిగెత్తావ్? అట్లా ఎదురొచ్చి చావకూడదూ?" విసుక్కున్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పండీ! ఏం జరిగింది?"

"ఇంకా ఏం జరగాలి? గడప దిగుతుండగానే వెంకాయమ్మ ఎదురైంది."

"అయ్యో రాత! శుభమా అంటూ లగ్న నిశ్చయాలకు వెళుతూంటే ఈ అపశకునం ఏమిటండీ?" నీళ్ళు కారిపోయింది కాంతమ్మ.

ఇంట్లో ఎదిగి గుండెలమీద కుంపటిలా వున్న పిల్లకు పెళ్ళి చెయ్యాలని ఆ దంపతులు నానా పాట్లూ పడుతున్నారు. కూతురు మనువు మాట్లాడటానికి వెళ్తున్న మంగపతికి దుశ్శకునం ఎదురైంది. ఈసారన్నా ముడిపడుతుందని ఇద్దరూ గంపెడు ఆశతో వున్నారు.

మంగపతి తేవడానికి చాలా సంబంధాలే తెచ్చాడు. కాని ఒక్కటీ కుదర్లేదు.

వచ్చిన సంబంధం తల్లికి నచ్చితే కూతురికి నచ్చదు. కూతురికి నచ్చితే తల్లికి నచ్చదు. తల్లీ కూతుళ్ళకు నచ్చితే తండ్రికి నచ్చదు. ముగ్గురికీ నచ్చితే కట్నం ఎక్కువ ఇవ్వలేక బెడిసిపోతుంది.

దేనికైనా కాలం కలిసి రావాలి! బ్రహ్మరాత ఎలా వుందో! దాని రాత ఎలా వుందో! మంగపతి ఆలోచిస్తూ నిల్చున్నాడు.

మంగపతి దంపతులు కాస్త పాతకాలం వాళ్ళు. నొసటి రాతల్లోను, జాతకాల్లోను నమ్మకం కలవాళ్ళు.

కూతురు తారాదేవి జాతకం రాయించి భద్రంగా కొయ్యపెట్టెలో పెట్టి దాచాడు. కూతురుకు పద్దెనిమిదో సంవత్సరం వస్తేగాని పెళ్ళి కాదని జాతకంలో స్పష్టంగా రాసిపెట్టి ఉంది. అయినా మంగపతి కూతురుకి పధ్నాలుగేళ్ళు నిండగానే సంబంధాలు చూడసాగాడు.

"జాతకం ఎలా ఉన్నా మానవ ప్రయత్నమూ వుండాలిగా?" అనుకొనేవాడు.

మంగపతి వేళ్ళమీద లెక్క వేసుకొస్తున్న రోజులు చూస్తుండగానే దొర్లిపోయాయి.

కూతురు పద్దెనిమిదినిండి పందొమ్మిదో సంవత్సరంలో అడుగుపెట్టింది. అందువల్లే ఈ సంబంధం తప్పక కుదురుతుందనే నమ్మకంతో బయలుదేరాడు. అపశకునం ఎదురైంది.

"లోపలకు వచ్చి రెండు నిముషాలు కూర్చోండి."

భార్య మాటలకు లోపలకు వచ్చి కూర్చున్నాడు. ఈసారి ఏ అపశకునం రాకుండా జాగ్రత్త పడ్డారు ఆ దంపతులు.

కాంతమ్మ పెద్ద కాసంత కుంకంబొట్టు పెట్టుకొని దొడ్డితోవన బయటికివెళ్ళి ఇంటిచుట్టూ తిరిగి వీధి వాకిట్లోకి ఎదురొచ్చింది.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గడపలు దిగుతున్న భర్తకు ఎదురైంది.

మంగపతి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఇదేమీ పట్టించుకోకుండా కూతురు వసారాలో కూర్చుని వారపత్రిక చదువుకుంటూ

వుంది.

కాంతమ్మ భోజనం చేసి వక్క పలుకు పటుక్కున కొరుకుతూ మంచానికి అడ్డంపడింది.

అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చి "అమ్మాయ్!" అంటూ కేకపెట్టి లేచి కూర్చుంది.

వారపత్రికలో సినిమా వార్తలు చదువుతున్న తార వినిపించుకోలేదు.

"నిన్నేనే?" గట్టిగా పిల్చింది తల్లి.

"అబ్బ ఏమిటే అమ్మా నీ గోల?" తార పత్రికలోనుంచి తల ఎత్తకుండానే అన్నది.

"పేపరు వేసి వెళ్ళాడా? ఇలా తీసుకురా!"

"వేసినట్టే వున్నాడు. నువ్వే చూసుకో" అన్నది తార.

"మా తల్లివిగా, కొంచెం తెచ్చి పెట్టవే!" తల్లి భుక్తాయాసంతో అన్నది.

తార విసురుగా లేచి తెలుగు దినపత్రిక తల్లి కూర్చున్న మంచంమీద వేసి వెళ్ళిపోయింది.

కాంతమ్మ పత్రిక విప్పి వారఫలాలున్న పేజీ తీసింది. తన రాశి అయిన "వృశ్చికం" చదువుకోసాగింది.

"ఈ వారం ఆరంభంలో ఎంతో కాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఒక దారికి వస్తాయి. వెదకపోయిన తీగ కాళ్ళకు చుట్టుకుంటుంది. బంధు ఆగమనం, శుభకార్యాలు చేస్తారు."

చదువుతూ వుంటే కాంతమ్మ హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

తన కూతురు గీత ఇన్నాళ్ళకు బయటపడింది. అచ్చు గుద్దినట్లు రాసి వుంటే ఇంకా సందేహం ఎందుకూ? అమ్మాయి పెళ్ళి నిశ్చయం అయినట్టే.

అది సరే! తన తెలివి తెల్లారినట్టే వుంది? ఇంకా ఆలోచన ఏమిటి? వియ్యాలవారే తన కూతుర్ని వెతుక్కుంటూ వస్తున్నారన్నమాట! అన్నమాటేమిటి? వస్తూనే వుంటారు. ఈపాటికి బయలుదేరారేమో?

ఈ మనిషి తెలివి దొంగలుతోలా? అట్లా బయలుదేరి వెళ్ళిపోయారేం, వాళ్ళే మనింటికి వస్తుంటేనూ? అన్నట్లు ఆ అపశకునంకూడా ఇందుకేనేమో? ఇవ్వాళ వెళ్ళొద్దనేనేమో?

ఆ వెళ్ళేవారు కాస్త వారఫలాలు చూసుకున్నాక వెళ్ళకూడదూ? ఆ మనిషికి అంతా తొందరే.

కాంతమ్మకు ఆలోచనల సంతృప్తిలో భుక్తాయాసం కాస్తా ఇట్టే ఎగిరిపోయింది.

వియ్యాలవారు ఏవేళప్పుడు వస్తారో ఏమో? కాంతమ్మ లేచి వంటింట్లోకి వెళ్ళింది.

కాఫీ పొడరూ, పంచదారా వున్న డబ్బాలు చూసుకుంది. ఇంత మినపప్పు నీళ్ళలో వేసింది!

"ఒసే అమ్మాయ్!"

"......."

"నిన్నేనే?"

"అబ్బబ్బ- ఏమిటే ఒక్క క్షణం చదువుకోనివ్వవూ?"

"ఇప్పుడేం చదువే? ఆ పత్రిక అవతలపారేసి తలదువ్వుకో. ఆఁ- మొన్న నాన్న

గుంటూరు నుంచి తెచ్చిన గులాబీ రంగు పట్టుచీర కట్టుకో. త్వరగాలే!" కూతుర్ని ఉత్సాహంగా హెచ్చరించింది.

"ఇప్పుడా పట్టుచీర ఎందుకే?" పుస్తకంలోనుంచి తల పైకెత్తి ఆశ్చర్యంగా ప్రశ్నించింది తార.

"ఎందుకేమిటే? వాళ్ళు ఏవేళప్పుడొస్తారో ఏమో? ఊం - త్వరగా లే!"

తారకు అర్థం కాలేదు. అయోమయంగా చూసింది.

"ఏమిటే అలా చూస్తావ్? వియ్యాలవారు వస్తున్నారులే. వెళ్ళి తల దువ్వుకో."

అంతలోనే వీధి వాకిట్లో గుర్రపు బండి ఆగిన శబ్దం అయింది.

ఎవర్నో పిలుస్తున్నట్టు విన్పించింది.

"అయ్యో, రానే వచ్చారు. ఒసేపిల్లా! నువ్వు లోపలకు వెళ్ళవే! త్వరగా ముస్తాబవు." కూతుర్ని హెచ్చరించి కాంతమ్మ పరుగు పరుగున వీధి వాకిట్లోకి వచ్చింది.

బండిలోనుంచి ఓ బుర్రమీసాల మొహం బయటికి తొంగిచూసింది.

"మంగపతిగారిల్లు ఇదేనా అండీ?" బుర్రమీసాలు ప్రశ్నించాయి.

"ఇదే. రండీ!" అంటూ కాంతమ్మ సగం శరీరానికి పైగా తలుపుచాటుకు లాక్కుంది.

బండిలోనుంచి బుర్రమీసాలాయనా, ఓ యువకుడూ, మరో నడివయసు వ్యక్తీ దిగారు.

యువకుడు కూలింగ్ గ్లాసులు పెట్టుకున్నాడు. జుట్టు మెడలదాకా పెంచుకున్నాడు. ముఖాన్ని కొంత జుట్టు కప్పేస్తూ వుంది. బెల్‌బాటం ఫాంటూ, చిన్న చిన్న నల్ల పువ్వులున్న తెల్లషర్టు వేసుకున్నాడు.

కాంతమ్మ కళ్ళు వెడల్పు చేసుకొని యువకుణ్ని చూసింది.

వచ్చినవాళ్ళ కాళ్ళకు నీళ్ళు ఇచ్చింది.

కాళ్ళు కడుక్కొని కుర్చీలో కూర్చుంటూ "మంగపతిగారు ఏరండీ?" అని అడిగాడు బుర్రమీసాలాయన.

"ఊరు వెళ్ళారు. సాయంకాలానికి తిరిగొస్తారు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి, ఈ లోపల ఆయన వచ్చేస్తారు" అని చెప్పి కాంతమ్మ పక్కగదిలో రెండు మంచాలు వాల్చి పక్కలు వేసింది.

వచ్చినవారిలో పెద్దవాళ్ళిద్దరూ ప్రయాణపు బడలికతో వున్నారు. పడుకుంటూనే నిద్రపోయారు.

యువకుడు మాత్రం కూనిరాగాలు తీస్తూ, మధ్య మధ్య దేనికోసమో వెతుకుతూ హాల్లో పచార్లు చేస్తున్నాడు.

కాంతమ్మ ఫలహారాలు చేసే ప్రయత్నంలో పడిపోయింది.

తార ముస్తాబై తల్లి పక్కగా వచ్చి కూర్చుంది.

కాంతమ్మ కూతుర్ని కళ్ళారా చూసుకుంటూ మురిసిపోయింది.

"అబ్బాయిని చూశావా?"

తార బుగ్గలు కెంపులైనాయి. "నేనెక్కడ చూశానేం?" సిగ్గుతో ముఖం దాచుకొని అన్నది.

"ఆ అబ్బాయి ఒంటరిగా వున్నట్టున్నాడు. వెళ్ళి మాట్లాడు." ముసిముసిగా

నవ్వుకుంటూ కూతురితో అన్నది కాంతమ్మ.

"నేను వెళ్ళను బాబూ, నాకు సిగ్గు!"

"మా తల్లివి గదూ! బాగుండదు. వెళ్ళమ్మా!" తల్లి బతిమాలింది.

తారకు వెళ్ళాలనే వుంది. పైకి మాత్రం వెళ్ళడం ఇష్టంలేనట్టు ముఖం పెట్టి బయటకు వచ్చింది.

బీరువా మీదవున్న పాత పత్రికలు తీసి చూస్తున్న యువకుడు అలికిడై తలెత్తి చూశాడు.

తార బాగా ముస్తాబయి, చేతిలో త్రివర్ణ ముఖచిత్రంగల ఓ సినిమా పత్రిక పట్టుకొని తలుపు వాలుగా కనీ కనిపించకుండా నిల్చుంది.

"ఇదిగోనండీ!" అంటూ చెయ్యి ముందుకు చాచింది.

అతను "ఇలా ఇవ్వండి" అన్నాడు నిల్చున్న చోటునుంచి కదలకుండానే.

సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ ముందుకు వచ్చి పత్రిక అందించింది.

అతను ఆమె ముఖంలోకి చూస్తూ పత్రిక అందుకోబోయి తార చేతిని అందుకున్నాడు.

తార చివ్వున తలెత్తి చూసింది. ఇద్దరి కళ్ళూ కలిశాయి.

"ఓ సారీ!" అంటూ చెయ్యి వదిలేశాడు.

"కూర్చోండీ!" అన్నాడు తను కూర్చుంటూ.

తార బోలెడంత సిగ్గుపడిపోతూ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

"మీకు సిగ్గు ఎక్కువనుకుంటాను. నో... నో... ఈ రోజుల్లో మరీ అంతగా సిగ్గు పడితే బాగుండదు," అన్నాడు ఆ యువకుడు.

తార గతుక్కుమంది.

"మీ పేరూ?"

"తార."

"నా పేరు చంద్రం! తమాషాగా వుంది కదూ! తారాచంద్రుల కథ తెలుసా?"

తార తెలుసు అన్నట్టు తల ఊపింది.

ఆ పెద్దమనుషులిద్దరూ కునుకు తీస్తుండగా కాంతమ్మ వంటింట్లో గారెలతో కుస్తీ పడుతుండగా తారాచంద్రులు రంగురంగుల కలల ప్రపంచంలో విహరిస్తున్నారు.

ఆ గంటలోనే వాళ్ళు ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. సినిమాల గురించీ, తెలుగు నవలల గురించీ, అభిమాన రచయిత్రుల గురించీ లోకం మర్చిపోయి కబుర్లు చెప్పుకున్నారు.

ఆ తర్వాత "నిన్నే చేసుకుంటాను" అన్నాడు చంద్రం.

"నిన్ను తప్ప మరెవర్నీ చేసుకోను" అన్నది తార.

బుర్రమీసాలాయన గుర్రు ఆగిపోయింది.

"మీ నాన్న లేచినట్టున్నారు, నేను వెళ్తాను."

"అప్పుడే" అంటూ చెయ్యి పట్టుకొని దగ్గరకు లాక్కున్నాడు.

"ఒరే అబ్బాయ్!"

చంద్రం తారను చటుక్కున వదిలేశాడు. తార లోపలకు తూనీగలాగా ఎగిరి

పోయింది. చంద్రం ఆమె వెళ్ళిన వైపే చూస్తూ నిట్టూర్పు విడిచాడు.

నాలుగ్గంటలకల్లా వారు కాఫీ, టిఫిన్లు పూర్తి చేశారు.

బుర్రమీసాలాయన చుట్ట ముట్టించుకొని పీలుస్తూ "మంగపతిగారు ఏ ఊరు వెళ్ళారండీ?" అని కాంతమ్మను అడిగాడు.

"మీతో మాట్లాడటానికే గుంటూరు వెళ్ళారు."

బుర్ర మీసాలాయన చుట్టతీసి పట్టుకొని కాంతమ్మ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

"మీ రిక్కడికొచ్చినట్టు తెలియగానే బయలుదేరి వచ్చేస్తారు, వస్తూనే వుండి వుండాలి" అన్నది కాంతమ్మ.

"బాపట్ల వెళ్ళారా?" అన్నాడు ఆయన.

"కాదండీ, గుంటూరు."

బుర్రమీసాలాయన అయోమయంగా చూశాడు.

"మాది గుంటూరు కాదండీ-బాపట్ల. బాపట్లనుంచి వస్తున్నాం. ఇవాళ వస్తున్నట్టు వుత్తరం కూడా రాశానుగా? అందలేదా?"

కాంతమ్మ గుండెలు చిక్కబట్టినై. వెర్రిగా చూసింది.

"మీ ఇంటిపేరు ఒంటిమిట్టవారేగా?" సందేహంగా అడిగాడు రెండో వ్యక్తి.

"కాదండీ, వేదాంతంవారు!" అన్నది కాంతమ్మ.

బుర్రమీసాలాయనా, ఆ రెండో వ్యక్తీ ఒకరి మొహంలోకి ఒకరు చూసుకున్నారు.

"ఎంత పొరపాటు! ఎంత పొరపాటు!" నొచ్చుకున్నాడు ఆ రెండోవ్యక్తి.

కాంతమ్మ వెర్రిచూపులు చూసింది.

తలుపుచాటుగా నిల్చున్న తార ముఖంలోకి దిగులుగా చూసింది.

చంద్రం కళ్ళు పెద్దవి చేసుకొని బుర్రమీసాలాయన్ని చూస్తున్నాడు.

"పొరపాటు జరిగిపోయింది. మేం వచ్చింది ఒంటిమిట్ట మంగపతిగారి ఇంటికమ్మా! క్షమించండి."

కాంతమ్మ కళ్ళకు బుర్రమీసాలాయన సినిమాలోని రాక్షసుడిలా కన్పించాడు.

తార నిట్టూర్పు విడిచింది.

చంద్రం తార ముఖంలోకి దిగులుగా చూశాడు.

"లేవండర్రా... ఇంకా కూర్చున్నారేం? వాళ్ళు మనకోసం ఉదయంనుంచి ఎదురుచూస్తూ వుండివుంటారు" అంటూ బుర్రమీసాలాయన లేచి నిల్చున్నాడు.

"పదరా!" తారకేసి చూస్తూ నిల్చున్న చంద్రాన్ని హెచ్చరించాడు తండ్రి.

కాంతమ్మ మాటా పలుకూ లేకుండా కూర్చుండిపోయింది.

చంద్రం తండ్రితో ఏదో చెప్పబోయి, మానేసి వెనకే బయలుదేరాడు. వీధి వాకిలి దాటుతూ మరోసారి తార వంకచూసి ముందుకుసాగాడు.

తారకు దుఃఖం పొర్లుకొచ్చింది!

కాంతమ్మ మనసు అవమానంతో దహించుకుపోతూవుంది.

వాళ్ళు తిని ఖాళీ చేసిన ప్లేట్లు, దొర్లాడిపోయిన పక్కలూ చూస్తుంటే కాంతమ్మ ఒళ్ళు జలదరించింది.

"తాడిచెట్టులా నిలబడ్డావేమే? ఆ ప్లేట్లు తీసెయ్!" కూతుర్ని కసురుకుంది.

తార దుఃఖం పొంగుకువస్తూవుంటే లోపలకు పరుగు తీసింది.

దిగాలుపడి కూర్చున్న కాంతమ్మ దృష్టి - అంత దూరంలో వున్న పత్రిక మీద పడింది. కాంతమ్మ కోపం తారాబలం రాసినవాడి మీదకూ, ఆ పత్రిక మీదకు మళ్ళింది.

పత్రిక చేతిలోకి తీసుకొని "గ్రహబలం" వున్న పేజీ తెరచి చూసింది.

"ఈ ముదనష్టపోడు మరి అట్టా రాశాడేం!" అనుకుంటూ మరోసారి చదవసాగింది.

"మీరు ఈ వారం చాలా జాగ్రత్తగా వుండాలి. ఆప్తులుగా వచ్చినవారివల్ల మనస్తాపం కలుగుతుంది. కష్టానికి కష్టం! ఖర్చుకు ఖర్చు! కుటుంబంలో అశాంతి..."

కాంతమ్మ మళ్ళీ మళ్ళీ చదివింది. ఇదేమిటి ఇలా వుంది? తన కళ్ళను తానే నమ్మలేకుండా వుంది.

అయితే తను మధ్యాహ్నం చదివిన పత్రిక ఇది కాదా?

కుర్చీకి వెనగ్గా పడివున్న మరో వారపత్రిక తీసి చూసింది. గ్రహబలం వున్న పేజీ పైనే వుంది. చదివింది. తారీఖు చూసింది.

అది పోయిన ఆదివారం పత్రిక.

"ఎంత పని చేశావే? నీ సినిమా పత్రికలూ నువ్వూ మండిపోను!" కూతుర్ని తిట్టిపోసింది.

తార మంచంమీద బోర్లా పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ వుంది.

ఈ వారం పత్రికలో రాసినట్లే జరిగింది. ఎంత అవమానం! ఎంత మోసం! శరీర కష్టానికి కష్టం! ఖర్చుకు ఖర్చూ! పైగా ఆయనకు తెలిస్తే! అమ్మో ఇంకేమయినా వుందా? అసలే అభిమానం మనిషి! తాట ఒలిచెయ్యడూ?

ఆయన వచ్చే సమయం కూడా అవుతోంది. కాంతమ్మ లేచి తార దగ్గిర కెళ్ళింది.

"నువ్వెందుకు ఏడుస్తావ్? నాన్న వస్తారేమో? లే! లేచి ముఖం కడుక్కో!"

తార దుఃఖం తారాస్థాయి అందుకుంది.

"ఏదో బండి వచ్చినట్టుంది. నాన్న వచ్చారేమో! లే! ఊం- నాన్నకి జరిగిన విషయం చెప్పకు."

"నేను ఆ అబ్బాయినే చేసుకుంటాను."

కాంతమ్మ విస్తుపోయి కూతురి ముఖంలోకి చూసింది.

"మరెవర్నీ చేసుకోను!"

"ఏమిటే వెధవ వాగుడూ నువ్వూనూ!"

'నేను ఆయన్ను ప్రేమించాను. ఆయన్ను తప్ప చేసుకోను. బలవంతం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాను."

కాంతమ్మ మతిపోయినదానిలా కూతుర్ని చూసింది.

"రండి! రండి!"

భర్త వియ్యాలవారిని తీసుకొస్తున్నట్టు తెలుసుకుంది కాంతమ్మ. ఆమె కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్టనిపించింది.

('ఆంధ్రజ్యోతి' మాసపత్రిక - 1954)